క్లుప్తంగా

క్రైస్తవుల సమస్యలపై సీఎం జగన్‌కు వినతి


సీఎం జగన్‌ను కలిసిన ఎలమంచిలి ప్రవీణ్

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం విశాఖ పర్యటన సందర్భంగా పీఎం పాలెం వైఎస్‌ఆర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టిన దళిత క్రైస్తవుల సమస్యను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేసును సుప్రీం కోర్టులో ప్రభుత్వం ద్వారా వాదించేలా నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని తెలిపారు. సుమారు 25 వేల మంది పాస్టర్లకు గౌరవ వేతనం అందలేదని, అందిరికీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌ను కలిసిన వారిలో మంత్రి మెరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఉన్నారు.

డీఎల్‌వోకు సన్మానం



తిరుపతి లీగల్: టీటీడీ న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జడ్జి వీర్రాజును టీటీడీ న్యాయ సలహాదారు, సీనియర్ న్యాయవాది ఎల్.మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీకి సంబంధించి వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై చర్చించారు.

ముగిసిన వసంతోత్సవాలు


స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన వసంతోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు శుక్రవారం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం చేపట్టారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): పదో తరగతిలో చంద్రగిరి మండలంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులను శుక్రవారం ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంఈఓ లలితకుమారి సన్మానించారు. నరసింగాపురానికి చెందిన యోగేశ్వర్, సంజయ్ అత్యధిక మార్కులు సాధించి జిల్లాలోనే ఉత్తమ విద్యార్థులుగా నిలిచారు. ఈ నేపథ్యంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా తీర్చిదిద్దారని ఎంపీపీ కొనియాడారు. అందువల్లే మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, రాగిని, ఎంపీటీసీ సుజాత, ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ రమేష్ బాబు పాల్గొన్నారు.

జడ్జి వీర్రాజు సేవలు మరువలేనివి

తిరుపతి లీగల్: తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జిగా వై.వీర్రాజు సేవలు మరువలేనివని న్యాయమూర్తులు, న్యాయవాదులు కొనియాడారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాలులో శుక్రవారం సాయంత్రం జడ్జి వీర్రాజుకు వీడ్కోలు పలికారు. జడ్జి వీర్రాజు మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో తనకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటకుమార్, ప్రధాన కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.52 వేలు

పాకాల: ఉప్పరపల్లి పంచాయతీ ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయానికి భక్తులు హుండీ కానుకల ద్వారా రూ.52,318 ఆదాయం వచ్చినట్టు కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీ కానుకలు లెక్కించారు. మూడు నెలలకు సంబంధించి కానుకలను లెక్కించినట్టు అధికారులు తెలిపారు.


సారె సమర్పణలో మేయర్ శిరీషతో ఎమ్మెల్సీ సిపాయి


సారె తీసుకెళుతున్న కార్పొరేటర్ ఈశ్వరమ్మ


సారె తీసుకెళుతున్న మహిళలు


అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

కరుణించమ్మా గంగమ్మా!

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- తోటి వేషధారుల సందడి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కొంతమంది కుటుంబ సమేతంగా వచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. భక్తుల తోటి వేషాలతో నగర పురవీధులు హోరెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు తోటి వేషంతో భక్తులు సందడి నెలకొంది. చిన్నా పెద్ద తేడా లేకుండా గంగజాతర వేషధారణలతో గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. విశేష పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు దొర వేషం

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా నాలుగో రోజు శనివారం సంప్రదాయబద్ధంగా కైకాల, చాకలి కులస్తులు అనువంశికంగా దొర, మంత్రి వేషాలు వేస్తారు. వీరి పక్కన తోటివాడు పాలేగాడి కొయ్య శిరస్సును చేతపట్టుకుని ఉంటారు. వీరు దొర, మంత్రి వేషాలు ధరించి డప్పు వాయిద్యాల నడుమ నగరంలో తిరుగుతూ ఇంటింటా పూజలు అందుకుంటారు. ఈ వేషాలను భక్తులెవరూ వేయరు. గంగబొట్లు పెట్టుకుని, వేపాకు చేతపట్టి భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు.


కళాకారుల కళా ప్రదర్శన

కోలాహలంగా గంగమ్మ సారె ఊరేగింపు

తిరుపతి తుడా: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు మున్సిపల్ కార్పొరేషన్ తరపున శుక్రవారం అధికారికంగా సారె సమర్పించారు. సాయంత్రం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కళాబృందాల నృత్య ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణల మధ్య కోలాహలంగా సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అధికారులు వివిధ వేషాలతో ఆకట్టుకున్నారు.

ప్రజలందరికీ అమ్మవారి దీవెనలు

తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ దీవెనలు నగర ప్రజలందరికీ ఉండాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆలయ జీర్ణోద్ధరణ , రాతి కట్టడంతో పునర్నిర్మాణం చేసుకోవడంతో పాటు గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామమన్నారు.




వివిధ వేషధారణలో పిల్లలు


తోటి వేషధారణలో పిల్లలు


సారె తీసుకెళుతున్న ఎమ్మెల్సీ సిపాయి


వేపాకు ధరించిన పిల్లలు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సారె ఇవ్వడంతో నగర ప్రజలందరూ ఇచ్చినట్లేనని పేర్కొన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత సారెను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఆర్‌వోకే ఎల్ వర్మ, సెక్రటరీ రాధిక, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సంజీవ్ కుమార్, దేవిక, గోమతి, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెంట్ పి.రవి, మెప్మా కృష్ణవేణి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు, ఉమాఅజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పంచి.. సారెలతో పులకించి


సారె తీసుకెళుతున్న నటుడు కిరణ్ అబ్బవరం


సారె తీసుకొస్తున్న ప్రాణిక్ యోగాశ్రమం కైలాస్‌స్వామి


హథీరాంజీ మఠం ఆధ్వర్యంలో సారె..

తిరుపతి కల్చరల్: జాతర ఆరంభమైన మూడో రోజు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక నగరం తిరుపతి సారెలతో హోరెత్తింది. గాంధీ రోడ్డులోని హథీరాం మఠం ప్రతినిధి అర్జున్ దాస్ ఆధ్వర్యంలో గంగమ్మకు సారెను సమర్పించారు. అలాగే కుప్పం బాదూరు వద్దనున్న ప్రాణిక్ యోగా ఆశ్రమం ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రతినిధి కైలాస్ స్వామి గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, గురవారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, నరసింహ డప్పు విన్యాసాలు ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. 21వ డివిజన్ ఎస్వీ నగర్ కార్పొరేటర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో 500 మంది మహిళా భక్తులతో సారె ఊరేగింపు చేపట్టి అమ్మవారికి సమర్పించారు.


మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

వేడుకగా శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మహాసంప్రోక్షణ

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలోని పురాతన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, కుంభస్థాపన, కుంభారాధన, విశేష హోమం చేశారు. సూర్యకుమార్ ఆచార్యులు కంకణభట్టారుగా వ్యవహరించారు. ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మిథున లగ్నంలో మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు రూ.70 లక్షల శ్రీవాణి నిధులతో పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. ఆదివారం నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు, టీటీడీ వైఖానస ఆగమ సలహాదారుడు మోహనరంగాచార్యులు, డెప్యూటీ ఈవో దేవేంద్ర బాబు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న పోకల అశోక్‌కుమార్

నేడు విద్యుత్‌కు అంతరాయం

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలో విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకువిద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేబీ లేఅవుట్, పాత ప్రసూతి ఆసుపత్రి, చెన్నారెడ్డికాలనీ, అనంతవీధి, వరదరాజనగర్, కేటీరోడ్డు, సింగాలగుంట, అంబేడ్కర్‌కాలనీ, గాలివీధి, టీనగర్, మాడవీధి, ఎన్జీవోస్‌కాలనీ, ఖాదీకాలనీ, రామచంద్రనగర్, శాంతినగర్, సప్తగిరినగర్, అలాగే చంద్రగిరి మండలంలోని చంద్రగిరి టౌన్, తొండవాడ, శానంబట్ల, మిట్టపాలెం, తుంగారంపల్లి, శ్రీనివాసమంగాపురం , నరసింగాపురం, నాగయ్యగారిపల్లి, రామిరెడ్డిగారిపల్లి, రాయల్‌పురం, పిచ్చినాయుడుపల్లి, అగరాల, పనపాకం, రంగంపేట, భీమవరం, గంగుడుపల్లి పంచాయల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

శానంబట్లలో మిస్టరీ మంటలు

- క్షుద్రపూజలని గ్రామస్తుల భయాందోళన
- గ్రామంలో శాంతి పూజలు
- ఆకతాయిలపనే అని పోలీసుల అనుమానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కొత్త శానంబట్ల పంచాయతీలో వరుసగా చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాలు మిస్టరీగా మారాయి. గ్రామంలో 20 రోజులుగా గడ్డివాములు, ఇళ్లలో బట్టలు, మంచాలు వాటంతటవే అగ్నికి ఆహుతి అవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొత్తశానంబట్లలో ఒకే కుటుంబానికి చెందిన పిల్లపాళెం శివశంకర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రవి, ఈశ్వర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి ఇళ్లు, పొలాల్లో అకస్మాత్తుగా మంటలు వ్యాపిస్తున్నాయి. 20 రోజుల క్రితం శివశంకర్ రెడ్డికి చెందిన గడ్డివాములు రెండు, 14 రోజుల క్రితం ప్రసాద్ రెడ్డికి చెందిన నాలుగు గడ్డివాములు, వారం క్రితం రవికి చెందిన ఒక గడ్డివాము, రెండు రోజుల క్రితం ఈశ్వర్ రెడ్డికి మరో గడ్డివాము కాలిపోయాయి. గురువారం మరోసారి ప్రసాద్ రెడ్డి ఇంట్లోని బీరువాలో మంటలు వ్యాపించి బట్టలు, రూ.35 వేల నగదు, బంగారం దగ్ధమయ్యాయి. వరుస ఘటనలతో ఎవరైనా క్షుద్రపూజలు చేశారేమోనని భావించిన గ్రామస్తులు మంత్రగాళ్లను ఆశ్రయించారు. శుక్రవారం గ్రామం నడిబొడ్డున గంగమ్మకు పూజలు చేశారు. పూజలు చేస్తుండగా సమీపంలోని మరో తాళం వేసిన ఇంట్లో మంటలు అంటుకున్నాయి. ఈ మిస్టరీ మంటలతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాపోతున్నారు. ఇదిలా ఉంటే కావాలనే ఆకతాయిలు ఈ ఘటనలకు పాల్పడుతున్నారని, త్వరలోనే ఈ మిస్టరీని చేధిస్తామని చంద్రగిరి పోలీసులు పేర్కొంటున్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రిలో శుక్రవారం డాలర్స్, గెహిణి గ్రూప్స్ సంయుక్తంగా నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నర్సులను సత్కరించారు. రుయా, మెటర్నటీ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న 500 మందికి పైగా నర్సులకు గొడుగులు అందజేశారు. డాలర్స్ గ్రూప్ అధినేత సి.దివాకర్ రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నర్సుల సేవలు అజరామరమన్నారు. రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ మాట్లాడుతూ నర్సులు 90 శాతం రోగులకు మనస్ఫూర్తిగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రుయా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఆర్ఎంవో యువఅన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నర్సులు మానవత్వానికి ప్రతిరూపమన్నారు. అనంతరం నైటింగేల్ చిత్ర పటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణమ్మ, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు భువనేశ్వరి, హెడ్ నర్సులు సరోజ, శైలజ, మానస పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నర్సులు

స్విమ్స్‌లో..

స్విమ్స్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. టీటీడీ జేఈవో సదా భార్గవి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉత్తమ సేవలు అందించిన నర్సులను సత్కరించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, నర్సింగ్ సూపరింటెండెంటు, హెడ్ నర్సులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈఎస్ఐ ఆసుపత్రిలోనూ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించిన నర్సులకు నైటింగేల్ అవార్డులతో సత్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, ఆర్ఎంవో ప్రసాద్ పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మునిరాజ



తిరుపతి రూరల్: తిరుపతి డివిజన్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బైని మునిరాజును నియమిస్తూ తిరుపతి ఆర్డీఓ కనక నరసారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రాపురం మండలం మిట్టకండ్రిగకు చెందిన మునిరాజ ఎమ్మార్పీఎస్ నాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

రైల్వే జెడ్‌ఆర్‌యూసీసీ మెంబర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



తిరుపతి రూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ రైల్వే ప్రయాణికుల కన్సల్టేటివ్ కమిటీ(జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యుడిగా పిల్లచెరువు చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ముత్యాలనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉండడంతో ఆయనను రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా నియమించింది.

నూతన జడ్జి పరిచయ సభ

తిరుపతి లీగల్: తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీపై వచ్చిన జడ్జి గురునాథ్ పరిచయ సభ శుక్రవారం సాయంత్రం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాలులో జరిగింది. జడ్జి గురునాథ్ మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి 5వ అదనపు జిల్లా జడ్జి అన్వర్ భాష, రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు, సీనియర్ సివిల్ జడ్జ్‌లు విజయసారథిరాజు, సునీతారాణి, జూనియర్ సివిల్ జడ్జిలు సత్యనారాయణ మూర్తి, వాణిశ్రీ, శ్రీకాంత్, సంధ్యారాణి, సరిత, కోటేశ్వరరావు, తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు వెంకటకుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్జి గురునాథ్

ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోండి


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల: మండల కేంద్రంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం బాలికల జూనియర్ కళాశాల, ఎస్‌వీఎస్ పాఠశాల, గాంధీనగర్ ఎంపీపీ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య పరీక్షల కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఉచిత వైద్య పరీక్షలకు వచ్చే వారికి అసౌకర్యం కలుగకుండా చూడాలని చెవిరెడ్డి లక్ష్మి అధికారులకు సూచించారు. అనంతరం ఆమె ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా పాకాల ఆర్టీసీ బస్టాండ్ గురించి పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో రూ.లక్షలతో ఈ ప్లాట్‌ఫాంని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెట్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నంగా బాబురెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ కస్తూరి, మునీర్, గుండ్లూరి సురేష్, మురళి, నంగా నితిన్‌రెడ్డి, నరసారెడ్డి, మునితర్నం రెడ్డి, సెంథిల్ పాల్గొన్నారు.

నిర్వాసితులకే ఇళ్ల స్థలాలు

- ఒక్క సెంటు కూడా ఆక్రమణ కాలేదు
- అధికార పార్టీ నేతల ప్రమేయం లేదు
- పద్మావతిపురం సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ రాజ్యలక్ష్మి

తిరుపతి రూరల్: మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన 15 కుటుంబాలకు మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఒక్క సెంటు భూమి కూడా అధికార పార్టీ నేతల ఆక్రమణలు లేవని పద్మావతి పురం సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పద్మావతిపురంలో అధికారపార్టీ నేతలు ఆక్రమణలు చేస్తున్నారని, శ్మశానాన్ని కబ్జా చేశారని కొందరు రాజకీయ పార్టీ నేతలు చేసిన ఆరోపణలను ఖండించారు. నిర్వాసితులైన 15 కుటుంబాలకు తప్ప ఒక్క సెంటు భూమి కూడా ఆక్రమణ కు గురికాలేదని తెలిపారు. మనసా వాచ కర్మనా కూడా 15 కుటుంబాలకే ఇస్తున్నామని, వేరే ఎవ్వరికి కూడా ఒక్క అంకణం కూడా ఇవ్వలేదన్నారు. ఇంత స్పష్టంగా, బహిరంగంగా చెప్పినా కూడా ఇంకా ఆరోపణలు చేస్తాం.. విమర్శలు చేస్తాం. అంటే అంతకు మించిన దిగజారుడుతనం లేదన్నారు. రాజకీయ దురుద్దేశంతో కూడిన ఆరోపణలను ప్రజలు గమనిస్తూనే ఉంటారని హెచ్చరించారు.

డెప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటే ఉంటాం

తిరుపతి కల్చరల్: తాము ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వెంటే ఉంటామని కార్వేటినగరం మండలం అన్నూరు సర్పంచ్ సుందరరాజు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తామంతా వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులమని తెలిపారు. తాము గ్రామ సమస్యలను మాత్రమే మీడియాకు తెలిపామని, వాటిని కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లోనూ డెప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటే ఉండి ఆయన గెలుపుకునకు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ పొన్నుస్వామి మాట్లాడుతూ గ్రామ ప్రజల అభిప్రాయంతో జ్యూస్ ఫ్యాక్టరీని పునః ప్రారంభిస్తామని తెలిపారు.